క్లుప్తంగా

చేతిపంపు రిపేరుపై హర్షం



వీపనగండ్ల: మండల కేంద్రానికి సమీపంలోని రంగయ్య గారి మైసమ్మ దేవత వద్ద ఉన్న చేతిపంపు చెడిపోయి భక్తులకు అసౌకర్యంగా ఉన్న విషయాన్ని గమనించి మండల కేంద్రానికి చెందిన ముంత మల్లయ్య యాదవ్ సోమవారం తన సొంత ఖర్చులతో రిపేరు చేయించారు. మైసమ్మ దేవత ఆలయానికి వచ్చే భక్తులు, రహదారి వెంట వెళ్లే ప్రయాణికులకు ఈ చేతిపంపు తాగునీటిని అందిస్తుంది. కొన్నాళ్లుగా పంపు రిపేరు కావడంతో భక్తులు నీటి కోసం ఇబ్బందులు పడ్డారు. రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు ముంత మల్లయ్య యాదవ్ తన సొంత డబ్బులతో చేతి పంపుకు మరమ్మతు చేయించడంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు బాగు చేయండి సారూ..



కొత్తకోట రూరల్: మండలంలోని అమడబాకుల మోడల్ స్కూల్‌కు వెళ్లే రోడ్డు సరిగ్గా లేకపోవడంతో ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలకు వచ్చే విద్యార్థుల ప్రయాణ సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు కొత్తకోట నుంచి అమడబాకుల మోడల్ స్కూల్‌కు ఉదయం, సాయంత్రం రెండు పూటల బస్సును నడుపుతున్నారు. అయితే అమడబాకుల నుంచి స్కూల్ వరకు వెళ్లే రోడ్డు సరిగ్గా లేకపోవడంతో బస్సు డ్రైవర్‌తో పాటు ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గతంలో ఎన్నోమార్లు ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. ప్రస్తుత ఎమ్మెల్యే చొరవ తీసుకుని పాఠశాలకు వెళ్లే రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీనం



అమరచింత: ఢిల్లీలో సోమవారం జరిగిన ఐఎఫ్‌టీయూ, టీయూసీఐ కార్మిక సంఘాల మధ్య జరిగిన అవగాహన చర్చల అనంతరం టీయూసీఐలో ఐఎఫ్‌టీయూను త్వరలోనే విలీనం చేయనున్నట్లు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం వెల్లడించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ కార్మిక హక్కుల పోరాటం, కార్మిక వర్గంపై జరుగుతున్న దాడులు గురించి నిరంతరం పోరాడుతున్నామన్నారు. దేశంలో భావసారూప్యత కార్మిక వర్గ సంఘాలన్నీ ఏకం కావాల్సి ఆవశ్యకత గురించి చర్చలు జరిగాయని తెలిపారు. కార్మిక వర్గ ఐక్యత ముందు పెట్టుబడిదారీ వర్గం ఓడిపోవాల్సిందే అన్నారు. రాజీలేని పోరాటాల ద్వారా తమ హక్కులను సాధించుకోవడమే కాకుండా దోపిడి, పీడన లేని పరిస్థితులు, అభివృద్ధి చేసుకోగలుతామనే అవగాహనతో విలీనం కోసం ముందుకు వచ్చామన్నారు. ఈ విషయమై త్వరలోనే మన రాష్ట్రంలో భారీ సభ నిర్వహించి విలీన ప్రకటన చేయనున్నట్లు సూర్యం తెలిపారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు నరేందర్, పద్మ, హన్మేష్, రాజన్న, వెంకటేష్, అరుణ్‌కుమార్, షేక్ యాకుబ్ షావలి, సాంబశివుడు, అశోక్, జగన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూర్: విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అలాంటి వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవ అన్నారు. సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నాయకులు స్థానిక వికాస్ జూనియర్ కళాశాల, ఎంఎల్‌టీ కళాశాలలను సందర్శించారు. విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేసే ప్రైవేట్ యాజమాన్యం వసతులు కల్పించడంలో పట్టనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థులకు మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవని ఈ విషయమై విద్యార్థులు యాజమాన్యం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా లాభం లేకుండా పోయిందన్నారు. కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, డీఐఈఓలకు విన్నవించామని, వారు స్పందించకుంటే ఈవిషయమై పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రవి, శ్రీహరి, శ్రీనాథ్, విద్యార్థులు ఉన్నారు.



ప్రతి ఎకరాకు సాగునీరు



పిన్నంచర్ల శివారులో కాల్వ పూడికతీత పనులు చేపడుతున్న గ్రామస్తులు

ఆత్మకూర్: నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ మండల నాయకులు అన్నారు. పిన్నంచర్ల గ్రామ చెరువుకు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సహకారంతో భీమా ఫేజ్–2 కాల్వ ద్వారా నీటి తరలింపునకు శ్రీకారం చుట్టారు. సోమవారం అమరచింత పెద్ద చెరువు నుంచి పిన్నంచర్ల చెరువు వరకు కాల్వలో జేసీబీతో పూడికతీత పనులు చేపట్టారు. మూడేళ్లుగా చెరువు నిండకపోవడంతో ఆయకట్టు రైతులు, మత్స్యకారులు ఇబ్బందులు ఎదుర్కొన్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో సానుకూలంగా స్పందించిన ఆయన జేసీబీని ఏర్పాటు చేసి పూడికతీత పనులు చేపడుతున్నారు. వారం రోజుల్లో పూడిక పనులు పూర్తయిన వెంటనే చెరువుకు నీరు చేరుతుందని తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మచ్చేందర్‌గౌడ్, ఖాజన్న, విజయలక్ష్మి, రాములు, వెంకటేష్, జగన్, విష్ణు, సత్యన్న, హరీష్‌గౌడ్, శ్రీను, మల్లేష్ తదితరులు ఉన్నారు.



చాకల్‌పల్లి సమీపంలో..

మైనర్–4 కాల్వ ప్రారంభం

గోపాల్‌పేట: మండలంలోని చాకల్‌పల్లి గ్రామ సమీపంలో డీ–8 మేజర్ 4 కాల్వను సోమవారం కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి గోపాల్‌పేట మండల ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి ప్రారంభించారు. ఈ కాల్వ ద్వారా మూడు కుంటలు నిండి ఏదుట్ల చెరువుకు నీరు వెళ్తుందన్నారు. సాగునీరు అందించాలని రైతులు కొన్నిరోజుల క్రితం ఎమ్మెల్యే మేఘారెడ్డిని కోరగా.. వెంటనే స్పందించి సొంత ఖర్చుతో కాల్వ తీయించారని సత్యశీలారెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రైతుల కోసం ఎంతో చేస్తోందన్నారు. రైతులు, ప్రజలు ఏ ఇబ్బంది ఉన్నా ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తే పరిష్కారం చూపుతున్నారని కొనియాడారు. వారం రోజుల పాటు మిషన్లు పెట్టి పనులు చేసి రైతులకు నీరందించినందుకుగాను స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



పామిరెడ్డిపల్లిలో చెక్కు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు



రేమద్దులలో..

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో బాధిత కుటుంబాలకు మంజూరయిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన తిరుపతి రెడ్డి భార్య అరుణతో పాటు మరో ఎనిమిది మంది అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందారు. వారు వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా.. విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకుపోయారు. దీంతో ఎమ్మెల్యే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంజూరు చేయించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు సోమవారం బాధితుల ఇంటికి వెళ్లి చెక్కును వారికి అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తిక్కన్న, సిద్దయ్య, కాంగ్రెస్ నాయకులు శ్రీశైలం, రఘుగౌడ్, నరేష్ షౌకత్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రెండు చెక్కులను సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు గోపాల్‌రావు, మాజీ ఉపసర్పంచ్ రాంబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన శేఖరయ్యకు రూ.37,500, నీలం ఆనందం కు రూ.25,000 చెక్కులను రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో మంజూరైనట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ ప్రసాద్‌రావు, గోపాల్‌రెడ్డి, రాములు, నర్సింహ, రాములు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడకు చెందిన ఇంతియాజ్ అనారోగ్యం బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆయన వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును సోమవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి బాధిత కుటుంబ సభ్యులు సలీమ్‌కు అందజేశారు. దీంతో చిన్నారెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఎర్రసత్యంకు ఘన నివాళి



కొత్తకోట రూరల్: జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రసత్యం 29వ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం కనిమెట్టలో ముదిరాజ్‌లు, ఎర్రసత్యం అభిమానులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ 1994లో మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచిన ఎర్రసత్యం రాజకీయ ఎదుగుదలను ఓర్వలేని కొందరు వ్యక్తులు కుట్రపన్ని హత్య చేయించారని, ఆయన ప్రజల మధ్యలో లేకున్నా ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ బాలరాజు, పరమేష్, బాలన్న, పెంటయ్య, యాదగిరి, హరికృష్ణ, పరుశరాములు, సురేష్‌కుమార్, కొండన్న, రామస్వామి, దేవన్న, వెంకటన్న ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఆత్మకూర్: మూలమళ్ల గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ సోమవారం తహసీల్దార్ రాజుకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ప్రత్యేక పాలన కొనసాగుతున్న నేపథ్యంలో వీధిలైట్లు వెలగడం లేదని, దోమల బెడద తీవ్రం అయిందని, విద్యుత్ లో ఓల్టేజీతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. ముసలిల సంచారంతో భయాందోళనలతో కొట్టుమిట్టాడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలోనే సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ హామీనిచ్చారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకుడు ప్రసాద్, నాయకులు వెంకటన్న, ప్రదీప్ ఉన్నారు.

కార్మికులకు భృతి విడుదల చేయాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

వనపర్తి: భవన నిర్మాణ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమాలకు హాజరైన వారికి ఇవ్వాల్సిన భృతి వెంటనే విడుదల చేయాలని సోమవారం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శితో కలిసి కార్మికులు కలెక్టర్ ఆదర్శ్‌సురభికి వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని అమరచింత, నాగవరం, కల్వరాల, చెన్నారం తదితర ప్రాంతాల్లో పదిహేను రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులకు హాజరైన కార్మికులకు సర్టిఫికేట్‌తో పాటు ఇవ్వాల్సిన భృతి రూ.4,500 విషయంపై కార్మిక శాఖ అధికారులు స్పందించటం లేదని కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో గుర్తింపు పొందిన ఐదు వందల మంది కార్మికులు శిక్షణ కార్యక్రమాలకు హాజరయ్యారని, శిక్షణ పూర్తై ఏడాది కావస్తున్నా.. భృతి విడుదల చేయలేదని వాపోయారు. సీఐటీయూ నాయకులతో పాటు కార్మికులు లక్ష్మి, దుర్గా, జ్యోతి, సుమార్తమ్మ, సువర్ణ, శారదమ్మ, శేఖర్, అయూబ్, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

రాజీవ్ సద్భావన జ్యోతియాత్ర



ఆత్మకూర్: దేశ మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ సద్భావన జ్యోతియాత్రలో భాగంగా సోమవారం నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు బైక్‌ర్యాలీ నిర్వహించారు. గతంలో రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడో యాత్ర రాష్ట్రంలోని మక్తల్ నియోజకవర్గం నుంచే ప్రారంభం అయిందని, ప్రస్తుతం రాజీవ్‌గాంధీ సద్భావన జ్యోతియాత్రతో దేశ ప్రజలను సంఘటితం చేసేందుకు తోడ్పడుతుందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రహ్మతుల్లా, తులసీరాజ్‌యాదవ్, మండల అధ్యక్షుడు పరమేష్, పట్టణ అధ్యక్షుడు నల్గొండ శ్రీను, గంగ, దస్తగిరి, షంషీర్, రఘు, రఫీఖ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలోని పుస్తెలతాడు చోరీ



రంగాపురంలో ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రాంబాబు

పెబ్బేరు రూరల్: మండలంలోని రంగాపురంలో ఓ దుకాణంలో ఉన్న మహిళ మెడలోంచి పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తులు లాకొని వెళ్లిన ఘటన సోమవారం రాత్రి 7.30 గంటలకు చోటుచేసుకుందని ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెబ్బేరు మండలంలోని, రంగాపురానికి చెందిన మందడి పద్మకు గ్రామంలోనే మేఘన లేడీస్ కార్నర్ దుకాణం ఉంది. ఆమె దుకాణంలో ఉండగా.. గుర్తుతెలియని వ్యక్తులు దుకాణంలోకి వచ్చారు. మెడలో వేసుకునే చైన్లు ఉన్నాయా అని అడిగారు. ఆమె దండలు చూపిస్తుండగా.. ఆమె మెడలోని 4.5 తులాల బంగారు పుస్తెలతాడును లాకొని వెళ్లారు. దీంతో బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సంఘటన స్థలాని డీఎస్పీ వెంకటేశ్వరావు, సీఐ రాంబాబు, ఎస్ఐ చేరుకొని పరిశీలించి విచారణ చేపట్టారు. ఆమె ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

విద్యార్థులకు బెల్టుల ప్రదానం

పెబ్బేరు రూరల్: రెండో నేషనల్ కరాటే కుంగ్‌ఫూ చాపియంన్‌షిప్ పోటీలను ఈ నెల 11న కల్వకుర్తిలో నిర్వహించారు. ఈ పోటీల్లో పెబ్బేరు మండల కేంద్రానికి చెందిన సుమన్ కరాటే అకాడమీ విద్యార్థులు పాల్గొని.. కటాస్ విభాగంలో గణేష్ గోల్డ్ మెడల్, వెపన్స్ విభాగంలో జోషిక గోల్డ్ మెడల్, భవిత సిల్వర్ మెడల్, స్పైరింగ్ విభాగంలో ధనుష్ సిల్వర్ మెడల్, బ్లాక్‌బెల్ట్ స్పారింగ్ విభాగంలో తశ్విన్, భీష్మనాథ్ గోల్డ్ మెడల్, పవన్‌కుమార్ సిల్వర్ మెడల్ సాధించారని సీనియర్ కరాటే మాస్టర్ మల్లికార్జున్‌గౌడ్ తెలిపారు.

జాతీయ నాయకులను ప్రతి ఒక్కరూ గౌరవించాలి



శ్రీ రంగాపురం పట్టణంలో..



అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రపరుస్తున్న బీజేపీ నాయకులు

అమరచింత: దేశ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న జాతీయ నాయకులను ప్రతి ఒక్కరూ గౌరవించి, వారి ఆశయ సాధనలో ముందుకు సాగాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు అన్నారు. దేశవ్యాప్తంగా హర్‌ఘర్ తిరంగా యాత్రలో భాగంగా పట్టణంలోని అంబేడ్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలను బీజేపీ ఆధ్వర్యంలో శుభ్రపరిచే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి జాతీయవాదాన్ని బలపరచాలని కోరారు. కార్యక్రమంలో క్యామ భాస్కర్, మేర్వ అనిల్, నరాల సిద్దురాములు, రాకేష్ శెట్టి, అర్జున్ కుమార్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యమని బీజేపీ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్ తెలిపారు. మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ప్రధాన కూడళ్ల గుండా బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటస్వామి, రాములు, లక్ష్మీనారాయణ, జానీ, రాజేష్, రాజు, ఎల్లస్వామి, నరేష్, కావలి రాము, మోహన్‌రాజు, శివ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో పారిశుద్ధ్య పనులు

సాక్షి ఎఫెక్ట్..



పిచ్చి మొక్కలు తొలగించడంతో శుభ్రంగా మారిన తహసీల్దార్ కార్యాలయం ఆవరణ

పాన్‌గల్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. 'కార్యాలయాల్లో లోపించిన పారిశుద్ధ్యం' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితం అయిన వార్తకు అధికారులు స్పందించారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను శ్రమదానం ద్వారా తొలగించి, శుభ్రం చేశారు. దీంతో పాటు ఓ గదిలో చిందరవందరగా ఉన్న పేపర్లల్లో అవసరమైన వాటిని ఉంచుకొని గదిని శుభ్రం చేశారు. వార్తను ప్రచురించి కార్యాలయం ఆవరణ, గదిని శుభ్రం చేసే విధంగా చేసిన సాక్షి దినపత్రికకు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యఖురాన్ మానవాళికి మార్గదర్శకం



ప్రసంగిస్తున్న మౌలానా అబ్దుల్‌ఖయ్యూం

ఆత్మకూర్: దివ్యఖురాన్ ప్రపంచ మానవాళికి మార్గదర్శకమని, ప్రతి ముస్లిం ఖురాన్ పఠనం చేయాలని హజ్రత్ మౌలాన ముఫ్తీ అబ్దుల్ ఖయ్యూం అతీఖురహ్మాన్ మజ్హారి అన్నారు. సోమవారం స్థానిక మస్జిదేనూర్‌లో పట్టణంలోని మక్తబ్ మదర్సా జియాఉల్ ఖురాన్ (అరబ్బీ పాఠశాల) విద్యార్థులకు సమ్మర్ క్యాంపు సర్టిఫికెట్లు అందించారు. ఈసందర్భంగా మౌలానా మాట్లాడుతూ ప్రవక్త మహ్మద్ సల్లల్లాహువలై వసల్లం సూక్తులు ఆచరణీయమని, తల్లిదండ్రులను గౌరవించాలని, ప్రతినిత్యం ఐదు పూటల నమాజ్ ఆచరించాలని, దాన, ధర్మాలు చేయాలని, ప్రతి ఒక్కరితో మర్యాద పూర్వకంగా మెలగాలని సూచించారు. దివ్యఖురాన్‌ను చిన్న, పెద్ద అందరు నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హాఫీజ్ ఫక్రుద్దీన్, హాఫీజ్ ముక్తదీర్, మౌలానా అబ్దుల్‌అలీం రషాది, రిటైర్డ్ ఎంఈఓ యూసూఫ్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిపై చర్యలు తీసుకోవాలి



జేసీబీతో నేలకూల్చిన రావి వృక్షం

పాన్‌గల్: ఒక పక్క అధికారులు విరివిగా మొక్కలు నాటాలని చెబుతున్నా.. మరో పక్క గ్రామ కంఠం స్థలం, రోడ్డు పక్కన ఏపుగా పెరిగి వృక్షాలను కొందరు వ్యక్తులు ఇష్టానుసారంగా ధ్వంసం చేస్తున్నారు. మండలంలోని వెంగళాయిపల్లిలో సోమవారం గ్రామ పంచాయతీ స్థలంలో రోడ్డు పక్కన పెద్ద రావి చెట్టు ఉండగా.. దానిని గ్రామానికి చెందిన గోపాల్‌రావు అనే వ్యక్తి ఎవరి అనుమతులు లేకుండా జేసీబీతో ధ్వంసం చేయించారు. నిందితుడిపై చర్యలు తీసుకుంటూ మరోసారి ఇలాంటి చర్యలకు ఎవరూ పూనుకోకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి విష్ణువర్ధన్‌ను వివరణ కోరగా.. చెట్టును నేలమట్టం చేయడానికి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని, ఈ విషయాన్ని మండల స్థాయి అధికారులకు నివేదిస్తామన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాము

గోపాల్‌పేట: గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలు అదుపు చేయొచ్చని రేవల్లి ఎస్ఐ రాము అన్నారు. సోమవారం ఆయన మండలంలోని నాగపూర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటుపై అవగాహన కల్పించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా దొంగతనాలు జరిగినప్పుడు దొంగలను, గొడవలు జరిగినప్పుడు సైతం నిందితులను గుర్తించొచ్చు అన్నారు. విద్యావంతులు, గ్రామ పెద్దలు, యువత సంయుక్తంగా ముందుకు వచ్చి విరాళాలు సేకరించి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. నేరం జరిగిన ప్రతి ప్రదేశంలో పోలీసుల ఉండరని, సీసీ కెమెరాలు ఉంటే బాధితులకు వేగంగా న్యాయం జరుగుతుందన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని కేపీఎస్ స్కూల్‌లో 1998–99 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత సోమవారం పట్టణ సమీపంలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకుని సంబరపడ్డారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆర్.విశ్వనాథ్, నరేష్‌సాగర్, ఆంజనేయులు, జగదీష్, రాము, రమ్య, శ్వేత, పల్లవి, ప్రశాంతి ఉన్నారు.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



మృతులకు నివాళులర్పిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఖిల్లాఘనపురం: ఎస్‌ఎస్‌ఏలో పని చేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు తిరుపతయ్య, పవన్‌కుమార్, వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ వద్ద భోజన విరామం సమయంలో మృతి చెందిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు తమకు ప్రభుత్వం కనీస వేతనం అమలు చేయాలని కోరారు. రూ.ఐదు లక్షల ఆరోగ్యబీమా, రూ.పది లక్షల జీవిత బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. 61ఏళ్ల తర్వాత ఉద్యోగ విరమణ చేసినవారికి రూ.పదిలక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ, సమగ్రశిక్షలో గాని ఉద్యోగం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రజిత, మల్లీశ్వరి, దేవేందర్, సుమేధా, సుమలత, అర్జున్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ అన్నెనారాయణ

పాన్‌గల్: చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం లభిస్తుందని మాజీ ఎంపీపీ అన్నెనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని మాందాపూర్ ఉన్నత పాఠశాలలో 2023–24 సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ప్రతిభ చూపిన వారికి నగదు బహుమతులు అందజేశారు. ప్రథమ విద్యార్థికి రూ.వెయ్యి, ద్వితీయ విద్యార్థికి రూ.800, ప్రతిభ చూపిన బాలికకు రూ.800 చొప్పున ఒక్కొక్క ఉన్నత పాఠశాలకు రూ. 2,600 చొప్పున నగదు బహుమతి అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నగదు బహుమతులను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని 10 ఉన్నత, ఒక కస్తూర్బా విద్యాలయంతో పాటు జూనియర్ కళాశాల విద్యార్థులకు కూడా ప్రతి ఏడాది నగదు బహుమతులు అందజేస్తున్నామన్నారు. మాజీ ఎంపీపీని ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆనంద్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

జర్నలిస్టులకు కొవ్వొత్తులతో నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

వనపర్తిటౌన్: జర్నలిస్టులుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల అకాల మరణం పొందిన గోదావరి ఖని, వరంగల్‌కు చెందిన మదనయ్య, యోగారెడ్డికి సోమవారం రాత్రి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రావు మాట్లాడుతూ.. జర్నలిస్ట్‌గా జీవితం ప్రారంభించి, ఆర్థిక ఇబ్బందులు తాళలేక మరణించిన కుటుంబాలకు ప్రభుత్వం రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను వనపర్తితో పాటు రాష్ట్రవ్యాప్తంగా పరిష్కరించాలని కోరారు. జర్నలిస్టులు నరసింహారెడ్డి, జానీ, రమేష్‌రెడ్డి, సుంకరి రమేష్, భానుప్రకాష్, ఈశ్వర్, సతీష్, అశోక్‌రెడ్డి, గోపి తదితరులు పాల్గొన్నారు.